# - సుశీలా పరిణయం -

* రచన : శ్రీ దివాకర్ల సన్యాసిరాజు. *

'లేడీస్, అండ్ జంటిల్‌మన్! 'మన కాలేజీ వార్షికోత్సవ సందర్భంలో విద్యార్థులు ప్రదర్శించబోయే 'మానవసేవ' అనే నాటిక 15 నిమిల్లో ప్రారంభమౌతుంది. అంతవరకూ కొంతమంది విద్యార్థులు పాటలు పాడతారు. ఇప్పుడు పాడబోయే వారు మిస్టర్ రంగనాథం 'బి,ఎ.సి. ఫైనలియర్ స్టూడెంట్.' హెడ్ ఆఫ్ ది డ్రమటిక్ అసోసియేషన్, మిస్టర్ ఆనంద్ కంఠం మైక్‌లో ప్రతిధ్వనించింది.

వెంటనే తెర తొలగిపోయింది. మైక్ దగ్గర రంగనాథం నిలబడి గొంతుకసవరించుకొని ఆడియన్సువైపు చూశాడు. ఒక ప్రక్క విద్యార్థినులు, మరో ప్రక్క ముందువరుసలో ఉపాధ్యాయులు, ఆవెనుక విద్యార్థులు–అందరి దృష్టి తన వైపే ఉంటంతో రంగనాథం గుండెల్లో ఏదో అలజడి బయలుదేరింది. మెల్లగా పాట మొదలెట్టాడు.

'పయనించే ఓ చిలుకా... పాట సాగుతోంది.

'యమా' అని అరిచారెవరో.

'చాలు దిగిపో...' ఈలలు, అరుపులు, చప్పట్లు–వాటితో రంగనాథం కాళ్ళువణకడం మొదలెట్టాయి.

భయంతో కళ్ళు, ముక్కు, ముఖం ఏకమైయ్యాయి. అవమానం భరించలేక మైక్‌తో సహా ప్రక్కకు పరుగెత్తాడు.

'వరెయ్! ఆనంద్ నేను మొదటే చెప్పాను పాడన్రా అని. వీళ్ళంతా పాడమని పోరుపెట్టారు. చూడు ఎంత అవమానమో – డాంమ్ యిన్సల్టు' అన్నాడు రంగనాథం ముక్కుతుడుచుకుంటూ.

'అంత చక్కగా గంటసాలకంటే బాగా పాడేవాడివి ఏంరా అలా నసిగా!' అన్నాడు రఘు మేకప్ పూర్తి చేసుకొని వచ్చి.

'స్టేజెక్కడం యిదే మొదటిసారిరా' అన్నాడు రంగనాథం ఏడుపు ముఖంతో.

'ఇప్పుడు పాడేవారు మిస్టర్ శంకరం. బి.ఎ. సెకెండ్ యియర్' అని మైక్‌లో చెప్పాడు ఆనంద్.

శంకరం బాగానే పాడాడు, అయినా కొంతమంది అరవడం మానలేదు.

'వీళ్ళు పాడలేరు. పాడుతున్న వాడిని చూసి ఓర్వలేరు' అని విసుక్కుంది లేడీస్ ప్రక్క రెండవ వరసలో కూర్చున్న సుశీల.

'వట్టి బ్రూట్సు' అంది ప్రక్కనున్న అరుణ.

'ఇప్పుడు పాడేవారు మిస్ స్వర్ణలత బి,ఎస్,సి. అని వినిపించింది మైకలో.

అందమైన రెండు జడల అమ్మాయి మైక్ ముందు నిలబడి పాట మొదలెట్టింది.

'నిదురపోరా తమ్ముడా!...'

'చాలక్కయ్యా!' అని అరిచారెవరో వెనక నుండీ.

'లతాముంగీస్కర్ !' (లతా మంగేష్కర్ కాదు) దిగిపో అని కీచుగొంతుక మళ్ళీ వినపడింది.

పాపం ఆ అమ్మాయి ఏలాగో పాట పూర్తిచేసి స్టేజి దిగిపోయింది.

'ఒరెయ్ వీళ్ళు మనుషులేనా అని?...ఏలా అరుస్తున్నారో చూడు! పాపం ఆ అమ్మాయి జడుసుకుందిరా. ఒరెయ్య్ వాలంటీర్లూ ఏం చేస్తున్నార్రా!' అని అరిచాడు రంగనాథం సీరియస్‌గా:

'వాలంటీర్సుకూడా వాళ్ళతో కలిసిపోయారు. సిగ్గులేదు, రాస్కెల్సుకి.ఆ అరిచేదేదో ధైర్యంగా స్టేజెక్కి అరవకూడదూ!' సరె! మరి పాడించొద్దు. అందరూ స్టేజ్ మీదకి పదండి. నాటిక బిగిన్ చెయ్యాలి. అన్నాడు ఆనంద్.

ఒక గంట ప్రదర్శనమైనా, నాటిక రసవత్తరంగా ముగిసింది. ఆనంద్ డైరెక్షన్‌తో పాటూ ఏక్షన్ కూడా అందర్నీ ముగ్ధుల్ని చేసింది.

అందరిమాట ఏలా ఉన్నా, ఆనంద్ రూపురేఖా

లావణ్యా నటనా కౌశల్యంపై ఒక చిన్నారి కళ్ళు బడ్డాయి.

'ఎవరే ఆ సుందరాకారుడు?' అంది సుశీల ప్రక్కనున్న చెలికత్తెతో.

'శ్రీ శ్రీ శ్రీ ఆనంద్ నామధేయుడు బి.ఎస్.సి. ఫైనలియర్ స్టూడెంట్ చెలీ' అంది అరుణ అనబడు ఆ చెలికత్తె నవ్వుతూ.

'అబ్బ!! ఎంత బాగా నటించాడు. ఎంత అందంగా, నిండుగా ఉన్నాడు. జాతకం చూసి పేరుపెట్టి ఉంటారు.' అనుకుంది. బి. ఎస్. సి, సెకెండు యియర్, చదువుతున్న సుశీల యింటికి వెళుతూ దార్లో, ఆ ముక్కలు కాస్తా పైకే వచ్చేశాయి.

నాటిక చూసినప్పటినుండీ సుశీలలో కలిగినమార్పు గమనిస్తూనే ఉన్నారు సుశీల చెలికత్తెలైన అరుణ, పద్మలు. అందుకే చెరొక ప్రక్క నిలబడి జాగ్రత్తగా నడిపిస్తున్నారు సుశీలని. ఈ మాటలు కాస్తా వారి చెవిన పడ్డాయి.

రెండు ప్రక్కల నుండీ యిద్దరూ మాట్లాడుతున్నా పరధ్యాన్నంగా నడుస్తోంది సుశీల. లైట్ బ్లూ ఫాంటు, టెర్లిన్ షర్టు, కర్లింగ్ బ్లాక్ హెయిర్, అందమైన గుండ్రని ముఖం, సుశీల కళ్ళకి కనిపిస్తున్నాయి.

'అరుణా! సుశీలని యిక్కడ వదిలామంటే చాలా ప్రమాదం. మోతాదు కొంచెం జాస్తీగానే పడినట్లుంది, పద యింటికి తీసుకెళ్ళి వాళ్ల బామ్మకి అప్పగిద్దాం' అని సుశీలను వాళ్ళింటి వరకూ తీసుకెళ్ళారు.

తలుపు తట్టగానే సుశీల బామ్మగారు వచ్చి తలుపు తీశారు.

'అదేమిట్రా! ఎనిమిదిగంటల కల్లా వచ్చేస్తామని వెళ్ళిన వాళ్లు యిప్పుడా రావడం. అవ్వ!! అర్ధ రాత్రి పూట యిలా తిరగొచ్చా! అందులోకి పెళ్ళికాని పిల్లలు...' అని నోరు నొక్కుకున్నారు బామ్మగారు.

'మాకేం భయం బామ్మగారూ! ముగ్గురం ఉన్నాంగా!' అంది అరుణ.

'బాగుందర్రా, ఎంత చదువుకుంటే మాత్రం ఆడపిల్లలే కదా! అర్ధ రాత్రి పూట పోకిరీ వెధవలు తిరుగుతూ ఉంటారు. యీమాటెప్పుడూ యిలా తిరక్కండి రోజులు బాగులేవు.' అన్నారు బామ్మగారు.

'అలాగే బామ్మగారూ!' అని జారుకొన్నారు అరుణ పద్మలు.

'పదమ్మా! సుశీలా భోజనం చేద్దువుగాని.' అంటూ వంటగది వైపు నడిచారు బామ్మగారు.

'యిప్పుడు భోజనమేమిటి బామ్మా! ఆకలిగాలేదు.' అంది సుశీల.

'అదేమిటే!! ఆకలి లేకపోవడమేమిటి! ఏం తిన్నావు గనక! సాయంత్రం వెళ్ళేటప్పుడు తిన్న మూడుపిండీల పూరీలేగా ... పద...పద ...' అన్నారు వెళ్ళుతున్నవార్లా వెనక్కి తిరిగి.

బామ్మగారి బలవంతంవల్ల తిన్నాననిపించుకొని వెళ్ళి పక్కమీద వాలిపోయింది సుశీల. కానీ నిద్రపడితేగా! ఆనంద్ రూపమేకళ్ళ ఎదుట కనిపిస్తోంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది. గంభీరమైన కంఠం మళ్ళీ వినాలనిపిస్తోంది.

మర్నాడు సాయంత్రం 5 గంటలైంది.

అరుణ, పద్మలు సుశీల యింటికొచ్చారు. బామ్మగారే తలుపు తీసి ఆహ్వానించారు.

'రండమ్మాయిలు,రండి,సుశీలకి వంట్లో బాగులేదుట, పడుకుంది. మధ్యాహ్నం భోజనంకూడా సరిగా చెయ్యలేదు.' అన్నారు బామ్మగారు.

'వంట్లో బాగులేదూ!!' అంటూ అరుణా పద్మలు ముఖాముఖాలు చూసుకున్నారు.

'ఆ గదిలో ఉంది వెళ్లండి కాఫీ పట్టుకొస్తాము.' అని వంటగదివైపు వెళ్ళారు బామ్మగారు.

'సుశీ!...సుశీ..,లేవోయ్ యిప్పుడు పడకేమిటి' అని తట్టి లేపింది అరుణ.

మంచి నిద్రలో కమ్మనికలలు కంటున్న సుశీల 'అబ్బే ఏమిటి బామ్మా అప్పుడే లేపేశావు.' అంటూ లేచింది.

అమ్మాయిలిద్దరూ ఆశ్చర్యపడి పోయారు.

'నిజంగా యిది లవ్ ఎఫెక్టే' అని తేల్చేసింది పద్మ.

'కళ్ళు చేతులతో నులుముకొని చూసి 'ఆ! మీరా!! ఎంత సేపైందోయ్ వచ్చి కూర్చోండి వస్తా:' అని ముఖం కడుక్కొని వచ్చింది సుశీల.

'ఏంవోయ్! ఎప్పుడూ సాయంత్రం 5 గంటలవరకూ పడుకోలేదు కదా ఏంటి సంగతి యివాళ...!' అంది పద్మ.

**1966 CALENDARS**

# NATIONAL,

in the calendar market, means top ranking designs with a special leaning to subjects of national significance.

A meeting point of traditional and modern art, our album presents a spectacular and complete range of pictures in diversified tastes designed by the artists famous for their imaginative calibre and commercial obsession. Mind you, for the perfection in publicity, there is no rival for our superfine calendars.

*Contact :*

**THE NATIONAL LITHO PRESS,**

Post Box No. 30, SIVAKASI.

A great name for the best in printing.

'అబ్బె తలనొప్పిగా ఉంటే, ఫీవర్ వచ్చినట్లుంది' అంది సుశీల.

'నిన్న రాత్రినుంచేనా?' అంది అరుణ వెంటనే.

'అవునే రాత్రి నిద్ర పట్టలేదు సరిగా' అంది సుశీల అమాయకంగా.

'అవును ఎలా పడుతుంది రాత్రంతా ఆనంద్ తలంపేకదూ!' అంది పద్మ మెల్లగా.

'ఏం సుశీలా! ఎలాగుందే ఒంట్లో!' అన్నారు బామ్మగారు.

'మరేం భయంలేదండీ అలా తిరిగొస్తే అదేపోతుంది' అంది అరుణ.

'నిన్నట్లా అర్ధరాత్రి వరకూ తిరక్కుండా చీకటి పడేసరికి వచ్చేయండి' అన్నారు బామ్మగారు వెళుతూ.

'అలాగే బామ్మా! అంటూ సుశీల డ్రెస్ మార్చుకొని వచ్చింది.

ముగ్గురూ కలసి బీచ్ కి బయలుదేరారు.

సుశీల దిక్కులు చూస్తూ నడుస్తోంది.

'అయితే ఏంవోయ్ సుశీ గాఢంగా ప్రేమించేశావన్నమాట తొలి చూపులోనే' అంది అరుణ.

'అందని పళ్లకోసం ఆశిస్తావు.' ఆనంద్ తత్వం నీకు తెలీదేమో!

యిప్పటికెందరో అమ్మాయిలు ప్రయత్నించి విఫలులైయ్యారు' అంది పద్మ.

'ఏం! అతను ఆజన్మ బ్రహ్మచారిగా ఉండిపోతాడా' అంది సుశీల వెంటనే.

'అయితే మరి మన సుశీల గతేమిటి?' అంది అరుణ.

(సశేషం)